క్లుప్తంగా

భగవద్గీత పారాయణ తరగతులు



వీరాంజయనేస్వామి ఆలయంలో భగవద్గీత పారాయణ తరగులకు హాజరైన చిన్నారులు

చింతల్: చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శ్రీధర్మ శాస్త్ర సేవాసమితి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణ తరగతులు జరుగుతున్నాయి. ఆదివారం కాలనీకి చెందిన పలువురు చిన్నారులు పాల్గొని భగవద్గీత శ్లోకాలతో పాటు అందులోని సారాంశాన్ని నేర్చుకున్నారు. ఈనెల 15వ తేదీ వరకు భగవద్గీత పారాయణ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 8గంటలకు శ్రీవీరాంజనేయస్వామి ఆలయానికి రావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

అతిథి అధ్యాపకుల వేతనాలు చెల్లించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కాలేజీలు, గురుకుల విద్యా సంస్థల్లో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు నెలసరి వేతనాలు చెల్లించాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్య సంస్థల్లో పేద విద్యార్థులకు బోధిస్తున్న అతిథి అధ్యాపకులకు కేవలం 72 గంటల వేతనం చెల్లించడం దారుణమన్నారు. అధ్యాపకులకు చెల్లించే వేతనాలు కుటుంబ అవసరాలు తీరక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ అతిథి అధ్యాపకుల వేతనాల చెల్లింపు పై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

వీసీ ప్రొ.సురేష్‌కుమార్ తీరు సరికాదు

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) వీసీ ప్రొ.సురేష్‌కుమార్ తీసుకుంటున్న విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలపై ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి ధ్వజమెత్తారు. ఆదివారం ఓయూ క్యాంపస్‌లోని డిస్కార్స్ సెంటర్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఇఫ్లూ కమిటీ ఆధ్వర్యంలో కన్వెన్షన్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌ఎల్ మూర్తి మాట్లాడుతూ.. వీసీ ప్రొ.సురేష్‌కుమార్ విద్యార్థి హక్కులను కాలరాసేల నిర్ణయాలు తీసుకోవడం దారుణమని, విద్యార్థి వ్యతిరేక చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన వారిని సెంట్రల్ వర్సిటీలకు వీసీలుగా నియమించి జాతీయ విద్య విధానం ముసుగులో విద్యను కాషాయికరణం చేస్తుందని ఆరోపించారు. ఉపకార వేతనాల్లో 58 శాతం కోత విధించి పేద విద్యార్థులను ఉన్నత విద్య దూరం చేస్తుందని ధ్వజమెత్తారు.

ఇఫ్లూ ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీ..

ఇఫ్లూ ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి ఆదివారం ప్రకటించారు. అధ్యక్షులుగా ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా అభయ్ క్రిష్ణ, ఉపాధ్యక్షులుగా అలెక్స్, అబ్రహాం, సహాయ కార్యదర్శిగా శ్రేష్ఠభట్టచార్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తరలిన బీఎస్‌పీ నాయకులు

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి నగరంలో ఆదివారం జరిగే బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ భరోసా సభకు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ అధ్యక్షులు రాములు ఆధ్వర్యంలో కార్యకర్తలు ,నాయకులు తరలివెళ్లారు.

2 భవనాలకు మోక్షం

వార్డు కార్యాలయాల ఏర్పాటుకు సిద్ధం



జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్ప సమీపంలోని మోడల్ మార్కెట్ భవనం

కుత్బుల్లాపూర్: ఎట్టకేలకు 8 ఏళ్ల తర్వాత ఆ రెండు భవనాలకు మోక్షం కలిగింది. సుమారు రూ.కోటి 20 లక్షల నిధులతో రెండు మోడల్ మార్కెట్లను నిర్మించి టెండర్లు పిలుస్తున్న అధికారులకు ప్రతిసారి చుక్కెదురైంది. 2015 నుంచి నేటి వరకు పలు దఫాలుగా దుకాణాలకు టెండర్లు ఆహ్వానించిన ఏ ఒక్కరు స్పందించక పోవడంతో నిరుపయోగంగా ఉంటూ వచ్చాయి.. ఎట్టకేలకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న 150 డివిజన్ల వారీగా వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్ ఆదేశించడంతో ఖాళీగా ఉన్న ఈ భవనాలపై అధికారులు దృష్టి సారించారు.

◆ ప్రజలకు అందుబాటులో ఉండేలా తీర్చిదిద్ది వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న నిరీక్షణ కు తెరపడింది. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని గాయత్రి నగర్, జగద్గిరిగుట్ట సర్కిల్ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప వద్ద ఉన్న రెండు మోడల్ మార్కెట్లను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత ఆదేశాలతో వార్డు కార్యాలయాలుగా తీర్చిదిద్దే పనుల్లో ఉప కమిషనర్లు మంగతాయారు, ప్రశాంతి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు

ఆయా వర్గాల వారీగా కేటాయించారు...

◆ గాయత్రి నగర్ మోడల్ మార్కెట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎనిమిది, మొదటి అంతస్తులో 9 మొత్తం 17 షటర్లు నిర్మించారు. వీటిలో జనరల్ కేటగిరీలో 10, ఎస్సీ కేటగిరీలో రెండు, ఎస్టీ కేటగిరీలో ఒకటి, బీసీ రెండు, వికలాంగ ఒకటి, ఇతరులకు ఒక షటర్ కేటాయించారు.

◆ జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్ప వద్ద మోడల్ మార్కెట్ మొత్తం 13 షటర్లు ఉండగా జనరల్ కేటగిరీలో ఐదు, బీసీ కేటగిరీలో రెండు, ఎస్సీ కేటగిరీలో రెండు, ఎస్‌సీ కేటగిరిలో ఒకటి, ఇతరులకు ఒకటి కేటాయించారు.

టెండర్లు పిలిచినా స్పందన కరువు..

ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉండగా ఎక్కడో ఒక మూలకు నిర్మాణం చేపట్టడం వాటికి టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. ఈ సముదాయాల్లో మెడికల్, కూరగాయలు, కిరాణం , జనరల్ స్టోర్, ఏటీఎం, మటన్‌షాప్, చికెన్ షాప్, సీఫుడ్, బేకరీ, స్వీట్ దుకాణం, డ్రై ఫ్రూట్స్, బ్యూటీ పార్లర్, హెయిర్ సెలూన్ దుకాణాల ఏర్పాటుకు చర్యలు చేపట్టిన స్పందన అంతంత మాత్రంగానే కనిపించింది. టెండర్ పిలిచిన ప్రతిసారి అధికారులకు నిరాశే ఎదురైంది.

తాగుబోతులకు అడ్డాగా..

కోటి రూపాయలకు పైగా నిధులు వెచ్చించి నిర్మించిన ఈ రెండు భవనాల్లో తాగుబోతులు రాత్రి అయ్యిందంటే చాలు పీకల దాకా తాగి సీసాలు పగలగొట్టి వెళ్తుండేవారు. ఈ విషయంపై పలు సందర్భాల్లో అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. దీంతో రాత్రి సమయంలో చుట్టుపక్కల వాళ్ళు ఇబ్బందులు పడుతూ వచ్చారు.. ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన అందించాలన్న ఉద్దేశంతో గ్రేటర్ పరిధిలోని అన్ని డివిజన్లో ఏర్పాటు చేస్తున్న వార్డు కార్యాలయాల్లో భాగంగా ఈ భవనాలు ప్రజలకు అందుబాటులో రానున్నాయి.



గాయత్రినగర్‌లోని మోడల్ మార్కెట్ భవనం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే

ఉద్యోగాలన్నీ భర్తీ

- కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి
- కేసీఆర్‌ను గద్దె దించాలంటే యువత సరూర్‌నగర్‌కు తరలిరావాలి



విలేకరుల సమావేశం అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు

జీడిమెట్ల: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసి ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తుందని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లోని ఉషోదయహాల్‌లో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సోమవారం సరూర్‌నగర్ స్టేడియంలో జరగబోయే యువ సంఘర్షణ సభకు యువకులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. విద్యార్థి నిరుద్యోగులకు న్యాయం జరిగే విధంగా ప్రియాంకగాంధీ చేతుల మీదుగా ఈ సభలో యూత్ డిక్లరేషన్ జరుగుతుందని అన్నారు.

కేసీఆర్‌కు బైబై చెప్తేనే యువకులకు ఉద్యోగాలు..

తెలంగాణ ప్రభుత్వం కేవలం తియ్యటి మాటాలతో నిరుద్యోగుల కడుపు నింపుతుంది. తప్ప యువకులకు ఉద్యోగాలు ఇవ్వడంలో విఫలం అయ్యిందని సత్యనారాయణ అన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి కేసీఆర్ అండ్ కో బ్యాచ్ అదిగో ఉద్యోగాలు ఇదిగో ఉద్యోగాల నోటిఫికేషన్లు అంటూ కాలాయాపన చేయడమే తప్ప వారు యువతకు చేసిందేమి లేదన్నారు. ఇప్పటికే తెలంగాణలో కేసీఆర్ పాలన అంతం అయ్యిందని యువత ఈసారి కేసీఆర్‌ను గద్దె దింపేందురు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

ఉద్యోగం రాక ఉపిరి తీసుకున్న వారి ఉసురు కేసీఆర్‌కు తప్పక తగులుతుంది..

ఉద్యోగం కోసం గంపెడు ఆశలతో పల్లెల నుంచి నగరానికి వచ్చి కోచింగ్‌లు తీసుకున్న విద్యార్థులను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఎంతో మంది విద్యార్థులు లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్‌లు తీసుకంటే నోటిఫికేషన్‌లు వేయకుండా పేపర్ లీకేజీలతో కాలం గడపడం సిగ్గుచేటని అన్నారు. 2024 జనవరి 1న రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం పక్కా అని ఆయన అన్నారు. కేసీఆర్‌ను గద్దె దింపాలంటే యువకులంతా సరూర్‌నగర్‌కు తరలిరావాలని కోరారు.

◆ ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, దుండిగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్, మహేష్ ముదిరాజ్, శివకుమార్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, ఇబ్రహీం, బత్తుతల చిరంజీవి, అరుణ్‌రెడ్డి, పరశురాం గౌడ్, ధర్మారెడ్డి, పూర్ణచందర్, బండి అవినాష్, లక్ష్మణ్, సత్యనారాయణ, మిద్దెల సీతారాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి



ప్రగతినగర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నిజాంపేట్: స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ సీతారామ రాజు సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మన్యం ప్రజలపై బ్రిటీషర్లు చేస్తున్న దారుణాలను ఎదురించి రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారని అన్నారు. స్వాతంత్ర్య భారత సంగ్రామంలో శివాజీ తరువాత అంతటి పోరాట పటిమ కనబరచిన మహావీరుడు అల్లూరి సీతారామ రాజు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జానకీరామరాజు, డాక్టర్ ఎంఆర్‌ఎస్ రాజు, సాయి రాజు, కృష్ణం రాజు, గోపాలకృష్ణం రాజు, గుణరంజన్ సాయి, రామకృష్ణం రాజు (ఆర్కే), శ్రీనివాస రాజు, భాస్కర రాజు, రామచంద్ర నాయక్, అబ్దుల్ నబీ, వైవీ రావు, రామరాజు, అల్లూరి మనవడు అల్లూరి శ్రీరామరాజు, కుందన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో సామాజిక స్పృహను పెంపొందించాలి





భౌరంపేట్‌లో శాంతినికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న చినజీయర్ స్వామి

దుండిగల్: పాఠశాలల యాజమాన్యాలు విద్యతో పాటు పిల్లల్లో మానతాదృక్పథాన్ని, సామాజిక స్పృహను పెంపొందించాలని చినజీయర్ స్వామి అన్నారు. భౌరంపేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శాంతినికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామిజీ మాట్లాడుతూ.. ధనార్జనే ధ్యేయంగా కాకుండా అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండేలా విద్యను అందించాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. 32 సంవత్సరాలుగా విద్యారంగంలో కొనసాగుతూ నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. భౌరంపేట్ శాంతినికేతన్ క్యాంపస్‌ను సువిశాలమైన స్థలంలో అన్ని హంగులతో ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడాలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పురుషోత్తమ్‌రావు, వైస్‌చైర్మన్ గుర్రాల నాగేశ్వరరెడ్డి, డైరెక్టర్లు సిద్ధార్థ పొలినేని, కొలన్ మేఘనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు చోరీ.. కత్తితో దాడి

పారిపోతున్న దొంగను పట్టుకున్న స్థానికులు

మియాపూర్: పట్టపగలు ఇంట్లో చొరబడి దొంగతనం చేయడమేగాక అడ్డుకున్న ఇంటి యజమానిపై కత్తితో దాడి చేసి పారిపోతున్న దొంగను కుటుంబ సభ్యులు ,కాలనీ వాసులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగేశ్వర్ రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శేరిలింగంపల్లి, నెహ్రూ నగర్ కాలనీకి చెందిన దాసరి సాయిలు కుటుంబ సభ్యులు ఆదివారం లింగంపల్లిలో పెళ్లికి వెళ్లారు. సాయంత్రం గుల్బర్గా జిల్లా చించోల్లికి చెందిన అక్బర్ పాష అనే వ్యక్తి వారి ఇంట్లోకి దూరి అల్మారాలో ఉన్న రూ. 1.17 లక్షల నగదు తీసుకుని పారిపోతుండగా ఇంటి యజమాని సాయిలు గమనించి అతడిని అడ్డుకున్నాడు. దీంతో అతను వెంట తెచ్చుకున్న కత్తితో సాయిలుపై దాడి చేశాడు. సాయిలు కేకలు విని అప్రమత్తమైన స్థానికులు దొంగను వెంబడించి పట్టుకుని చందానగర్ పోలీసులకు సమచారా అందించారు.. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గాయపడిన సాయిలును కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో గోడపత్రికను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాశ్ ముదిరాజ్, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, పటాన్‌చెరు బీసీ నాయకుడు నీలం మధు హాజరవుతారన్నారు.

పోలీసులు ప్రహరీని కూల్చివేయడం హేయమైన చర్య



పోలీసులు కూల్చివేసిన ప్రహరీని చూపుతున్న లంకపల్లి చిన్న

సుభాష్‌నగర్: తనకు చెందిన రిజిస్ట్రేషన్ ప్లాట్ల స్థలంలో కొత్తగా మంజూరైన పోలీస్‌స్టేషన్‌కు స్థలాన్ని కేటాయించారని దుండిగల్ పోలీసులు ప్రహరీని కూల్చివేయడం హేయమైన చర్య అని స్థల యజమాని లంకపల్లి చిన్న ఆరోపించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సూరారం ప్రధాన రోడ్డు సాయిబాబానగర్ చౌరస్తాను ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 49/7లో 1979లో గాజులరామారం గ్రామపంచాయతీ, రంగారెడ్డిజిల్లా కలెక్టర్ అనుమతితో 54 ప్లాట్లను చేశామన్నారు. 1994లో గణేష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌గా నామకరణం చేశారన్నారు. అప్పటి నుంచి అందులో తాను పది ప్లాట్లు కొనుగోలు చేసి వాటికి ఎల్ఆర్‌ఎస్, బీఆర్‌ఎస్ తీసుకొని రెండు చోట్ల నిర్మాణాలు కూడా చేపట్టామన్నారు. 1997లో సదరు స్థలం ప్రభుత్వానికి చెందిందని అధికారులు రాగా హైకోర్టును ఆశ్రయించడంతో తామే నెగ్గామని పేర్కొన్నారు. దీంతో రెవెన్యూ వారు తిరిగి సుప్రీంకోర్టు వెళ్లగా అప్పటి నుంచి వివాదంలో ఉండడంతో స్థలం కబ్జా కాకుండా రెవెన్యూ అధికారుల అనుమతితో గతంలో చుట్టూ ప్రహరీ నిర్మించామని అన్నారు.

తాజాగా ఆ స్థలాన్ని పోలీస్ స్టేషన్‌కు కేటాయించారని పోలీసులు ప్రహరీని కూల్చివేయడం ఎంతవరకు న్యాయమని వాపోయారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి, కోర్టుకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ సంజీవరావును సాక్షి వివరణ అడగగా సూరారంలో కొత్తగా మంజూరైన పోలీస్‌స్టేషన్ భవనానికి స్థలం చూపించే ప్రపోజల్ ఉందని, మూడు చోట్ల చూడమని తెలిపామే తప్ప స్థలం కేటాయించ లేదని తెలిపారు.

రోడ్డు వేయించిన కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు



కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న మిథిలా మీడోస్ అపార్ట్‌మెంట్ వాసులు

నిజాంపేట్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్నాని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ రేణుక ఎల్లమ్మ కాలనీలో ఇటీవల రోడ్డు పనులు పూర్తయ్యాయి. ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక తాము పడుతున్న ఇబ్బందులను గుర్తించి రోడ్డు వేయించిన వీరేందర్‌రెడ్డిని ఆదివారం కాలనీకి చెందిన మిథిలా మీడోస్ అపార్ట్‌మెంట్ వాసులు సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కాలనీ సభ్యులతో సమావేశమైన కార్పొరేటర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కోడారి వెంకటేష్, మిథిలా మీడోస్ అపార్ట్‌మెంట్ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఎక్కడపడితే అక్కడ నిర్మాణ వ్యర్థాల డంప్



రక్షణ చర్యలు చేపట్టకుండా ట్రాక్టర్‌పై తరలిస్తున్న ఇసుక

చింతల్: ఓవైపు అక్రమ డంపింగ్‌లతో ఎక్కడపడితే అక్కడ ఇళ్ల నిర్మాణ వ్యర్థాలను డంప్ చేస్తూ ఉండటమే కాక వాటిని తరలించే క్రమంలో వాహనదారులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారు నిర్మాణ సామగ్రి విక్రయిదారులు. ఉదయం వేళలో అక్రమ డంపింగ్‌ల వద్ద పదుల సంఖ్యలో భారీ కంటైనర్లు, ఇసుక లారీలతో వాహనాదారులకు చుక్కలు చూపిస్తున్నారు. ఉదయం వేళల్లో వివిధ ప్రాంతాల నుంచి నిర్మాణ సామగ్రిని తీసుకొని ప్రధాన రోడ్లపై అక్రమంగా డంపు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నా అక్రమ వ్యాపారస్తులు. వీరు వ్యాపారంలో భాగంగా ఇళ్ల నిర్మాణ సామగ్రిని వివిధ బస్తీలు, కాలనీలో నిర్మించే భవనాల వద్దకు ట్రాక్టర్లలో తరలించే క్రమంలో ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. కానీ కొంతమంది ట్రాక్టర్ల డ్రైవర్లు ఎక్కడికక్కడ తరలించే క్రమంలో ఇసుకపై టార్పన్ కవర్లను కప్పకుండా తరలిస్తుండటంతో వాహనదారుల కళ్లల్లో ఇసుక రేణువులు పడి ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వాహనదారుల కళ్లల్లో ఇసుక, ధూళి పడి ప్రమాదాల బారిన పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణ సామగ్రి డంపింగ్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాక్టర్ల ద్వారా తరలించే క్రమంలో రక్షణ ఏర్పాట్లు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు చూడరు.. వినతులు వినరు

- ఇప్పటికైనా స్పందించండి
- మరమ్మతులు చేపట్టండి



విజయ్‌నగర్ కాలనీ ప్రధాన రోడ్డు ఎత్తు కంటే దిగువన ఉన్న ఓ గల్లీ రోడ్డు



రంగారెడ్డినగర్: అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి విజయ్‌నగర్ కాలనీ ప్రధాన రోడ్డు పనులను ఇటీవల పూర్తి చేశారు. ఇంత వరకు బాగానే ఉంది. కాని ప్రధాన రోడ్డుకు అనుసంధానంగా ఉన్న గల్లీల రోడ్లు కంటే ప్రధాన రోడ్డు అర ఫీట్ ఎత్తులో ఉండటంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. రోడ్డు పనుల సమయంలో అధికారులు దగ్గరుండి అనుసంధానంగా ఉన్న గల్లీల రోడ్ల వద్ద రాకపోకలకు వీలుగా లెవెల్ చేయించాల్సి ఉంటుంది.కాని ఇవేమీ పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో నెల రోజులుగా ఆయా గల్లీల రోడ్ల వద్ద వాహనదారులు ఇటుకలకు, చిన్న చిన్న బండరాళ్లను రోడ్డు వద్ద వేసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు స్పందించిన గల్లీల జంక్షన్ల వద్ద ప్రధాన రోడ్డుకు సాఫీగా వాహనదారులు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మ్యాన్‌హోల్ ధ్వంసం



పద్మానగర్-1 రింగ్‌రోడ్డు సమీపంలో ధ్వంసమైన మ్యాన్‌హోల్

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్లపై భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల ధ్వంసమై ప్రమాదకరంగా మారుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని పద్మానగర్-1 రింగ్‌రోడ్డు సమీపంలో పది రోజుల క్రితం భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ ధ్వంసమైంది. నిత్యం పదుల సంఖ్యలో ఇటుగా రాకపోకలు సాగిసున్న వాహనదారులు కుంగిన మ్యాన్‌హోల్‌ను ఢీకొని గాయాల పాలవుతున్నారు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. దీంతో ప్రమాద సూచికగా మ్యాన్‌హోల్‌లో చెట్టు కొమ్మను ఏర్పాటు చేసి దానికి ఖాళీ సిమెంట్ బస్తాను ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా అధికారులు కుంగిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఇసుక బస్తాలే డివైడర్ దిమ్మెలుగా..

రంగారెడ్డినగర్: ప్రధాన చౌరస్తాల్లో వాహనదారులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరుగకుండా ట్రాఫిక్ పోలీసులు చౌరస్తాల్లో డివైడర్ దిమ్మెలను ఏర్పాటు చేశారు. అయితే కొందరు వాహనదారులు వాటిని తొలగించి మరీ రాకపోకలు సాగిస్తున్నారు. జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డులోని లాస్ట్‌బస్టాప్ సమీపంలో ఇందిర గాంధీ చౌరస్తాలో ఈ దిమ్మెలను ఏర్పాటు చేయగా కొన్ని ధ్వంసమయ్యాయి. దీంతో స్థానికులు వాహనాలు వెళ్లకుండా ఇసుక బస్తాలను పెట్టారు. అధికారులు శాశ్వత ప్రాతిపదికన రోడ్డు మధ్య డివైడర్లను ఏర్పాటు చేస్తే ప్రమాదాలకు ఆస్కారముండదని వాహనదారులు పేర్కొంటున్నారు.

నిర్వహణ అటకెక్కింది..

రంగారెడ్డినగర్: పారిశ్రామికవాడ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ అటకెక్కింది. పరిశ్రమల నుండి లక్షలాది రూపాయలు టాక్స్‌ల రూపంలో వసూలు చేస్తున్నా నాలాలను శుభ్రం చేసేవారే కరువయ్యారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతంలోని కూకట్‌పల్లికి వెళ్లేదారిలో ఓ పరిశ్రమ ఎదుట నాలాలో వ్యర్థాలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో సమీపంలోని పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు దుర్వాసనలు భరించలేకున్నారు. రోజుల తరబడి నాలాలో వ్యర్థాలను తొలగించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇలా అధికారులు వ్యర్థాలను తొలగించి సమస్యను పరిష్కరించాలని స్థానిక పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.



గాంధీనగర్ పారిశ్రామికవాడ నుంచి కూకట్‌పల్లికి వెళ్లే మార్గంలో నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు